# సాక్షి
# భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 27 । మార్చి । 2024




**ఎప్పటికి నిర్మిస్తారో..?**
జిల్లా పోలీస్, ఎస్పీ కార్యాలయాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనుల్లో ఎడతెగని జాప్యం జరుగుతోంది. 8లో



**బస్టాండ్లలో అధికారుల తనిఖీలు**
జిల్లాలోని బస్టాండ్లలో ఏక కాలంలో తనిఖీలు చేపట్టిన అధికారులు.. వివిధ షాపుల యజమానులకు జరిమానా విధించారు. 8లో




**వాతావరణం**
జిల్లాలో బుధవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం మొదలైన ఎండ గంటగంటకూ పెరుగుతుంది.




## న్యూస్‌రీల్

### కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళ వారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

### కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు




స్వామివారి విగ్రహంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, బలిహరణం, సాయంత్రం రథోత్సవం, దొంగల దోపు వేడుక నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణ చేశారు.

### నేడు 'నిధి ఆప్‌కే నికట్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు బుధవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు 'నిధి ఆప్‌కే నికట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రబీలాల్‌దాస్ తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు నేలకొండపల్లిలోని మధుకాన్ షుగర్ ఇండస్ట్రీస్‌లో, భద్రాద్రి జిల్లా వాసులు ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

### నవమి పనులకు టెండర్లు ఖరారు



రామాలయం వ్యూ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న జరగనున్న శ్రీసీతారాముల కల్యాణం ఏర్పాట్లకు సంబంధించిన టెండర్లను ఆలయ అధికారులు ఖరారు చేశారు. భద్రాచలం, పర్ణశాల పరిధిలోని మొత్తం 19 పనులకు రూ.1.30 కోట్లుగా అంచనా వేయగా, రూ.1,10,82,000కు ఖరారయ్యాయి. వీటిలో కల్యాణ మండపం, పర్ణశాలలో విగ్రహాలకు రంగులు వేయడానికి రూ.7,23,411, ఫ్లైఓవర్ స్వాగత ద్వారాలు రూ.3,56,450, సెక్టార్ల ప్రవేశ ద్వారాలకు రూ.5,46,840, భద్రాచలం, పర్ణశాలలో చలువ పందిళ్ల నిర్మాణానికి రూ.4,65,433తో పాటు తాత్కాలిక షామియానాలు, కార్పెట్లు, ప్రసాదం కౌంటర్లు, ఎల్ఈడీ స్క్రీన్లు, ఇతర పనులకు ఖరారు చేశారు. ఈ పనులు త్వరగా ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని ఆలయ అధికారులు టెండర్ దారులను ఆదేశించారు.



గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. దారిన పోయేవారిని కరుస్తూ కండలు పీకేస్తున్నాయి. నిన్నా మొన్నటి వరకు అరుదుగా కనిపించే ఇలాంటి ఘటనలు ఇప్పుడు తరచూ జరుగుతున్నాయి. మానవ జీవన ప్రమాణాల్లో వస్తున్న మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి కారణాలతో కుక్కలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. బూర్గంపాడులో మంగళవారం కుక్కల దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా, జిల్లాలో ఇలాంటివి తరచుగా చోటుచేసుకుంటున్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

# గర్జిస్తున్న గ్రామ సింహాలు

**ఎండ వేడితో శునకాల్లో 'సమ్మర్ స్ట్రెస్'**
- వీధి కుక్కలకు కరువైన నీళ్లు, నీడ
- కొంచెం కవ్వించినా దాడి చేస్తున్న వైనం
- గ్రామాలు, పట్టణాల్లో కనిపించని నీటితొట్లు



గతేడాది పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన నీటితొట్టి

**వీధుల్లో నీరు కరువై..**
పట్టణాల నుంచి గ్రామాల వరకు చాలా చోట్ల డ్రెయినేజీ వ్యవస్థ మెరుగైంది. అలాగే ఇంటింటికీ నల్లాలు రావడంతో వీధి కుళాయిలు, బోరింగుల సంఖ్య కూడా తగ్గుతోంది. ఇలాంటి వనరులపై ఆధారపడే వీధి కుక్కలకు చాలినంత నీరు లభించడం లేదు. దీనికి తోడు రోడ్ల విస్తరణ, విద్యుత్ వైర్ల కోసం చెట్లను నరికేయడం, రోడ్లపైనే వాహనాల పార్కింగ్ వంటి కారణాలతో వాటికి సరైన నీడ కూడా అందకుండా పోతోంది. నీరు, నీడ కరువైన ఫలితంగా వీధి కుక్కలు ఎక్కువగా సమ్మర్ స్ట్రెస్‌కు లోనవుతున్నాయి.

**కవ్విస్తే కాటేస్తాయి..**
సమ్మర్ స్ట్రెస్‌కు గురైన సమయంలో జాగిలాలు వాటిలో అవే తగవు పెట్టుకుంటాయి. ఒకదానిపై ఒకటి గట్టిగా అరుస్తూ దాడులు చేసుకుంటూ ఉంటాయి. ఈ సమయంలో వాటిని రాళ్లతో కొట్టడం, తరమడం వంటి పనులు చేస్తే క్రూరంగా దాడి చేయడానికి అవి వెనుకాడవని పశువైద్య నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు కుక్కలను రాయితో కొట్టడం, కళ్లలో కళ్లు పెట్టి చూడటం, అదలించడం వంటివి చేయొద్దని సూచిస్తున్నారు. సమ్మర్ స్ట్రెస్‌కు గురైన కుక్కలు బలహీనంగా ఉండే చిన్న పిల్లలను లక్ష్యంగా చేసుకుని ఎక్కువగా దాడులు చేస్తాయి. కాబట్టి వేసవిలో కుక్కలు ఎక్కువగా సంచరించే చోట చిన్నారుల పట్ల జాగ్రత్తగా ఉండటం మేలని వైద్యులు అంటున్నారు.

**జాడలేని నీటి తొట్లు**
ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే కుక్కలు ఒత్తిడికి లోనవుతాయి. దీంతో కలహించుకునే స్వభావం వాటిలో పెరుగుతుంది. ఈ సమయంలో ఎవరైనా టీజ్ చేసినట్లు అనిపిస్తే వెంటనే దాడి చేస్తాయి.

**ఎండలు పెరిగితే..**
మనుషుల శరీర ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉంటాయి. వాతావరణ ఉష్ణోగ్రతలు వేసవిలో పెరిగితే దానికి అనుగుణంగా పెరిగే శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు చెమట పడుతుంది. చలి కాలంలో ఉష్ణోగ్రతలు తగ్గితే శరీర ఉష్ణోగ్రత పెంచేందుకు వణుకు వస్తుంది. జంతువుల శరీరాలు సైతం చలి, వేసవిలకు తీవ్రంగా స్పందిస్తాయి. చలి, ఎండల నుంచి రక్షించుకునేందుకు మనుషులకు అనేక అవకాశాలు ఉన్నాయి. కానీ జంతువులకు లేవు. దీంతో ఉష్ణోగ్రత మార్పులకు అనుగుణంగా జంతువుల స్పందన ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిన సందర్భాల్లో కుక్కలు, కోతుల ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు కనిపిస్తాయి. ఈ పరిణామాన్ని పశువైద్యులు సమ్మర్ స్ట్రెస్‌గా పేర్కొంటారు. అయితే మిగిలిన జంతువులతో పోల్చితే కుక్కలకు మనుషులతో ఎక్కువ మచ్చిక కావడంతో వీటి ప్రవర్తనలో వచ్చే మార్పుల ప్రభావం మానవులపై కనిపిస్తుంది.

అయితే తాగునీటిని అందుబాటులో ఉంచడం ద్వారా కొంతమేర ఈ సమస్యను అదుపులోకి తేవచ్చు. గతంలో వీధి కుక్కలతో పాటు పశువులకు సైతం మంచి నీరు అందించేందుకు గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్లు (వాటర్ త్రోట్) ఉండేవి. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు కొన్ని సందర్భాల్లో స్థానికులు, జంతు ప్రేమికులు సైతం ఇక్కడ నీటిని అందుబాటులో ఉంచేవారు. గత కొన్నేళ్లుగా నీటి తొట్ల నిర్వహణ జాడే లేదు. దీంతో చాలా చోట్ల అవి కనుమరుగైపోవడం లేదా ఉపయోగించలేని స్థితికి చేరుకున్నాయి.

**జాబితాలు పంపి మూడేళ్లు..**
గ్రామాలు, మున్సిపాలిటీల్లో నీటి తొట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని మూడేళ్ల క్రితం అన్ని జిల్లాల్లోని పశుసంవర్ధక శాఖలకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు సిద్ధమైన జాబితాలు తిరిగి ప్రభుత్వానికి అందాయి. ఆ తర్వాత ఈ విషయంలో ఉలుకూపలుకూ లేకుండా పోయింది. గతేడాది పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో అప్పటి కమిషనర్ కుక్కల కోసం ప్రత్యేకంగా నీటి తొట్లు ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో పెరిగే వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్తగా నీటితొట్లు ఏర్పాటు చేసే అంశాన్ని స్థానిక సంస్థలైనా పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**వేసవిలో ప్రతీ జీవికి నీరు అవసరం**
వేసవిలో ప్రతీ జీవికి నీరు ఎక్కువ అవసరం. కుక్కలు సహజంగా నాలుకను బయటకు వదిలేసి ఉంటాయి. దాని ద్వారా వాటి లాలాజలం కూడా ఎక్కువగా ఆవిరి అవుతుంటుంది. అవి ఉండడానికి సరైన షెడ్లు కూడా లేకపోవడంతో శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. కాబట్టి నీరు ఎక్కువ తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ క్రమంలో అక్కడక్కడా నీటితొట్లు ఏర్పాటు చేయడం మంచిది. కుక్కలకే కాదు.. పక్షులు, ఇతర జంతువులకు కూడా నీరు అందించడం ఎంతో మేలు.
– రవీందర్, అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్

# రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి

**కలెక్టర్ ప్రియాంక ఆల**



మాట్లాడుతున్న ప్రియాంక ఆల, హాజరైన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 127 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై చెక్‌లిస్ట్ జారీ చేస్తామని, ఆ ప్రకారం ఏర్పాట్లు చేసి ధృవీకరణ పత్రం జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాకు సమీప రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున నియంత్రణకు సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు విధులు నిర్వహించేలా నివేదికలు తయారు చేయాలని సూచించారు. సీఎంఆర్ రైస్ మిల్లులను తనిఖీ చేసి ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా తేడాలుంటే కఠినచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఇన్‌చార్జ్ అధికారులను నియమించాలని, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రాన్ని, సీఎంఆర్ మిల్లులను తనిఖీ చేయాలని డీఎస్‌ఓ రుక్మిణిని ఆదేశించారు.

**తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి..**
జిల్లాలో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గతంలో మంజూరైన పనుల పురోగతిపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ డీఈలు, పబ్లిక్ హెల్త్ ఈఈలు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. ప్రతిరోజు సమీక్షలో పనుల పురోగతిపై నివేదిక అందజేయాలని సూచించారు. ఆయా సమావేశాల్లో ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, రంగప్రసాద్, ఎన్ఐసీ డీఈఓ సుశీల్‌కుమార్, డీఎల్‌ఎంటీపీ. సాయికృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్, మిషన్ భగీరథ ఎస్‌ఈ సదాశివం, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, జిల్లా సహకార శాఖ అధికారి ఖుర్షీద్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి అలీం పాల్గొన్నారు.

**మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి**
జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 9 ఆగ్జలరీ కేంద్రాల కోసం రాష్ట్ర ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా 1,401 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,401 సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,827 ఓపీఓలను కేటాయించామని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని వివరించారు.

# బీజేపీని నిలువరించేది కమ్యూనిస్టులే..




మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచ : రాష్ట్రంలో బీజేపీ అడుగుపెట్టకుండా నిలువరించే సత్తా కమ్యూనిస్టులకే ఉందని, ఆ పార్టీ సిట్టింగ్ స్థానాల్లోనూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని, ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీయేతర అభ్యర్థుల విజయానికి పని చేయాలని పిలుపునిచ్చారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, తెలంగాణాకు అడుగడుగునా అన్యాయం జరిగిందని అన్నారు. ధరలు నానాటికీ పెరుగుతుండడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ధరల అదుపులో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, డి.శేషయ్య, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, సాయిబాబు, వాసిరెడ్డి మురళి, జి.వీరస్వామి, దసురు, మల్లికార్జున్, బండి నాగేశ్వరరావు, రాహుల్, పద్మజ, నగేశ్, కొండలరావు, జమలయ్య, లక్ష్మీపతి, కుమారి, హనుమంతరావు, రాము, శ్రీను, వెంకటేశ్వర్లు, హరీశ్ పాల్గొన్నారు.

# ఆధునిక టెక్నాలజీతో ఉత్పత్తి పెంచాలి

**సింగరేణి సీఎండీ బలరామ్ సూచన**



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్, పక్కన డైరెక్టర్ సత్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి బొగ్గు ఉత్పత్తి పెంచాలని సింగరేణి సీఎండీ బలరామ్ అన్నారు. స్థానిక సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణతో కలిసి మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం బొగ్గు ఉత్పత్తిలో ముఖ్యమైన యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని, వాటి పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, నిర్వహణ ఖర్చులు తగ్గించాలని సూచించారు. నూతన సాంకేతికతతో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంతో పాటు పని ప్రదేశాల్లో రక్షణ సూత్రాలు పాటించాలని అన్నారు. సమావేశంలో ఈఅండ్ఎం విభాగాల మేనేజర్లు పాల్గొన్నారు.

# మరోమారు బీజేపీ ప్రభంజనం

**పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి వినోద్‌రావు**



కూసుమంచిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం/కూసుమంచి: త్వరలో జరిగే ఎన్నికల్లోనూ మోదీ ప్రభంజనంతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఆయనను అభ్యర్థిగా ప్రకటించగా తొలిసారి మంగళవారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆతర్వాత కూసుమంచిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ర్యాలీగా ఖమ్మం బయలుదేరారు. ఇక ఖమ్మం కాల్వొడ్డు నుంచి పాత బస్టాండ్, వైరారోడ్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్, గట్టయ్య సెంటర్ మీదుగా బీజేపీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ కొత్త వ్యక్తినైనా తనకు అవకాశమిచ్చిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు జేపీ.నడ్డా, కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణుల సహకారంతో ఖమ్మంపై తొలిసారిగా కాషాయ జెండా ఎగురవేయబోతున్నామని తెలిపారు. ఇందుకు ప్రజలు మద్దతు తెలిపి, మోదీని మరోమారు ప్రధానిగా చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో 400 సీట్లు గెలవడం ఖాయమని, అందులో ఖమ్మం సీటు కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యాం రాథోడ్, నున్నా రవికుమార్, నాయకులు అల్లిక అంజయ్య, గోపాలరెడ్డి, నాగేశ్వరావు, మార్తి ప్రసాద్, సరస్వతి, ప్రభాకరరెడ్డి, వెంకటేశ్వరావు, చంద్రశేఖర్, భద్రం నాయకులు హట్యానాయక్, చావా కిరణ్‌కుమార్, గద్దం వెంకటేశ్వర్లు, దామళ్ల ప్రభాకర్, గుండా ఉపేందర్‌రెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అడవితల్లి రక్షణలో ఆడబిడ్డలు

- దూలపల్లి అకాడమీలో శిక్షణ
- 47మందిలో 8మంది మహిళా బీట్ ఆఫీసర్లు
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఎఫ్‌బీఓల స్టడీటూర్



సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో శిక్షణ బృందం

సత్తుపల్లిటౌన్: విత్తు నాటడం మొదలు మొక్కను సంరక్షించే వరకు మహిళలకు ఉన్న ఓపిక ఇంకెవరికీ ఉండదు. ఏ ఇంట్లో చూసినా ఈ విషయాన్ని గుర్తించొచ్చు. ఇదేస్ఫూర్తితో మానవాళి మనుగడకు ప్రధాన కారణమైన అడవుల సంరక్షణకు సైతం మహిళలు కదిలొస్తున్నారు. పనివేళలతో సంబంధం లేకుండా అటవీ ఉద్యోగులు నిరంతరం విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇది సవాల్‌తో కూడుకున్నదే అయినా కత్తి మీద సాము లాంటి ఈ ఉద్యోగాల్లోకి అతివలు ఆసక్తిగా వస్తున్నారు. వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా, చెట్ల నరికివేతను అడ్డుకోవడంతో పాటు పోడు జరగకుండా పర్యవేక్షించాల్సిన అనేక బాధ్యతలు ఉన్నప్పటికీ అడవితల్లిపై మమకారంతో ఆడబిడ్డలు అటవీ బీట్ ఆఫీసర్ ఉద్యోగాన్ని ఎంచుకుని కదనరంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు.

**ఇక్కడ శిక్షణ చాలా బాగుంది..**



అకాడమీలో అటవీ సంరక్షణ పాఠాలు నేర్చుకున్నాం. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో స్టడీ టూర్ ఎంతో విజ్ఞానాన్ని అందించింది. ఇక్కడ శిక్షణ చాలా బాగుంది. చాలా అంశాలను క్షేత్రస్థాయిలో వివరించారు. విధుల్లో చేరాక పర్యావరణ పరిరక్షణకు అంకితభావంతో కృషిచేస్తా.
– జె.థెరిస్సా, జగిత్యాల

**ప్రకృతిలో పని చేయాలని..**



ప్రకృతిలో పనిచేయడం ఆనందంగా ఉంటుంది. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణానికి నా వంతు సహకారం అందించాలనేది లక్ష్యం. అందుకే ఈ ఉద్యోగం ఎంచుకున్నా. సత్తుపల్లి పార్కులో చాలారకాల మొక్కలు, వాటి స్వభావాలు తెలుసుకున్నాం.
– ఎ.రేఖ, కారేపల్లి

**ఉమ్మడి జిల్లాలో స్టడీ టూర్**
కొద్దినెలల క్రితం నిర్వహించిన పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా సత్తా చాటిన 47మంది బీట్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. వీరిలో ఎనిమిది మంది మహిళలు ఉండగా.. ప్రస్తుతం హైదరాబాద్ దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యాన బీట్ ఆఫీసర్లు మూడు రోజుల క్రితం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్టడీ టూర్‌కు వచ్చారు. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ అభయారణ్యంలో శిక్షణ అనంతరం ప్రస్తుతం సత్తుపల్లి అర్బన్‌పార్కు, జేవీఆర్ ఓపెన్‌కాస్టు, తల్లాడ కనిగిరి గుట్టలు తదితర ప్రాంతాలను సందర్శించి మొక్కలు, వివిధ రకాల జంతువులు, పర్యావరణ అంశాలపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా మహిళా బీట్ అధికారులను 'సాక్షి' పలకరించగా ఈ వృత్తిని ఎంచుకోవడం వెనుక ఉన్న ఆసక్తి, ఇతర అంశాలను వెల్లడించారు.

**యూనిఫామే మా ధైర్యం..**



అడవిలో జంతువులు, స్మగ్లర్ల నుంచి సవాళ్లు ఎదురవుతాయని తెలిసినా యూనిఫామే మా ధైర్యం. సమాజానికి ఉపయోగపడే అడవులను సంరక్షించే ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఒకటి, రెండు కాదు వేల మొక్కలు నాటించి సంరక్షించే అవకాశం మాకు లభిస్తుంది.
– జె.శ్రీవల్లి, సర్వాపూర్

**అన్ని రంగాల్లో మహిళలు..**



ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. అటవీశాఖలో ఉద్యోగం సవాలే అయినా ఇష్టపడి ఎంచుకున్నా. పర్యావరణ సమతుల్యతకు ఉపయోగపడే అటవీ సంరక్షణకు అంకితభావంతో పనిచేస్తా. ప్రకృతి అందాల మధ్య విధులు నిర్వర్తించే అవకాశం దక్కడం అదృష్టం.
– బి.పద్మజ, వరంగల్

## క్లుప్తంగా

### వాలీబాల్ విజేత.. చెరువుకొత్తగూడెం



విజేత జట్టుతో నిర్వాహకులు

ఇల్లెందురూరల్: కొమరారంలో రాధాకృష్ణుల కల్యాణం సందర్భంగా నిర్వహించిన ఎనిమిది మండలాల స్థాయి వాలీబాల్ పోటీల్లో బయ్యారం మండలం చెరువుకొత్తగూడెం జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజులపాటు హోరాహోరీగా సాగిన టోర్నీలో 74 జట్లు తలపడ్డాయి. చెరువు కొత్తగూడెం విజేత కాగా.. కొమరారం, జగదాంబగుంపు, గుండాల మండలం మామకన్ను జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగదుతోపాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కోరం కోటమ్మ, జోగా కృష్ణ, మూడు మాలు, కోరం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రాజగోపురం నిర్మాణానికి రూ.11 లక్షల విరాళం



ఆలయంలో రామకృష్ణారెడ్డి తదితరులు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన చిన్న అరుణాచలం ఆలయంలో ఐదంతస్తుల రాజగోపురం నిర్మాణానికి సూదిరెడ్డి రామకృష్ణారెడ్డి రూ.11లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఐదంతస్తుల రాజగోపురం, అతి పెద్ద నందీశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు తన కుటుంబం తరఫున రూ.11 లక్షల విరాళం ప్రకటించారు. దీంతో ఆయనకు ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి ధన్యవాదాలు తెలిపారు.


### 'పది' పరీక్షకు 96 మంది గైర్హాజరు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షకు ఐదో రోజైన మంగళవారం 96 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,341 మందిలో 49 మంది, ప్రైవేటు విద్యార్థులు 375 మందిలో 47 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కాగా, తాను నాలుగు పరీక్ష కేంద్రాల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 19 సెంటర్లలో తనిఖీలు చేశామని వివరించారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులేమీ నమోదు కాలేదని తెలిపారు.

### గాయపడిన కౌన్సిలర్‌కు కేటీఆర్ ఫోన్

సత్తుపల్లి: సత్తుపల్లిలో సోమవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎస్.కే.చాంద్‌పాషాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఫోన్ చేశారు. అధైర్యపడొద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే, దాడిచేసిన అధికార పార్టీ నేతలు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. కాగా, కౌన్సిలర్‌పై దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు. అలాగే, తనను దూషించి కొట్టినట్టు దిలీప్ చేసిన ఫిర్యాదుతో చాంద్‌పాషాపైనా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే, కౌన్సిలర్ వ్యక్తిగత గొడవలను పార్టీకి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన కాంగ్రెస్ శ్రేణులపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని పార్టీ నాయకులు గాదె చెన్నారావు, ఎం.డీ.కమల్‌పాషా ఓ ప్రకటనలో తెలిపారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,045 |

# ఎప్పటికి నిర్మిస్తారో..?

- జిల్లా పోలీస్, ఎస్పీ కార్యాలయాల నిర్మాణానికి రూ.38.50కోట్లు మంజూరు
- 2022 జూన్ నుంచి కొనసాగుతున్న నిర్మాణ పనులు

కొత్తగూడెంటౌన్: జిల్లా పోలీస్, ఎస్పీ కార్యాలయాల భవన నిర్మాణ పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో ఎడతెగని జాప్యం జరుగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్, ఎస్పీ కార్యాలయ భవన నిర్మాణాలకు సంబంధించిన 2022లో రూ.38.50 కోట్లను పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించారు. టెండర్లను ఆహ్వానించి నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ అదే ఏడాది జూన్‌లో పనులు ప్రారంభించినప్పటికీ రెండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి..



కలెక్టరేట్ వెనకాల నిర్మాణంలో ఉన్న ఎస్పీ కార్యాలయం

#### జాప్యం ఎందుకు..?

పాల్వంచ సమీపంలోని కలెక్టర్ కార్యాలయం వెనకాల డీపీఓ, ఎస్పీ కార్యాలయాల భవనాలు నిర్మించేందుకు నిర్ణయించారు. డీపీఓ కార్యాలయానికి రూ.20 కోట్లు, ఎస్పీ కార్యాలయ భవనానికి రూ.19.50 కోట్లు కేటాయించారు. భవన నిర్మాణాల కోసం టెండర్లు పిలవగా దక్కించుకున్న కాంట్రాక్టర్ రూ.4 కోట్లు పైచిలుకు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టాడు. నిర్మాణ పనులు కొంతవరకు పూర్తి చేశాడు. కానీ, ఆయనకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. పిల్లర్లు, స్లాబ్ వరకు అయిన పనులు మధ్యలోనే ఆగిపోయినట్లు సమాచారం. బిల్లులు సకాలంలో చెల్లిస్తే మిగతా పనులను చేపడతానని కాంట్రాక్టర్ అధికారుల వద్ద వాపోతున్నట్లు తెలిసింది. అసలు బిల్లులు ఎందుకు చెల్లించకుండా నిలిపివేశారో అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, 2016 నుంచి ఎస్పీ కార్యాలయం సింగరేణి సంస్థకు చెందిన భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక నూతన భవనాలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



మధ్యలోనే నిలిచిపోయిన పోలీసు కార్యాలయ భవనం

# ఆర్టీసీ బస్టాండ్లలో అధికారుల తనిఖీలు

నిబంధనలు పాటించని షాపుల యజమానులకు జరిమానా

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ బస్టాండ్లలో అధికారులు మంగళవారం ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లలోని షాపు ల యజమానులు నిబంధనలు పాటించడం లేదని, నాణ్యత లేని సరుకులు అమ్ముతుండడమే కాక ఎమ్మార్పీకి మించి ధర వసూలు చేస్తున్నారని 'సాక్షి'లో ఈ నెల 25న 'బస్టాండ్లలో అదనపు బాదుడు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు రీజియన్‌లోని బస్టాండ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వివరాలను రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న వెల్లడించారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఎనిమిది షాపుల యజమానులకు రూ.10 వేలు, సత్తుపల్లి బస్టాండ్‌లో ఇద్దరికి రూ.1,500, ఇల్లెందు బస్టాండ్‌లో ఇద్దరికి రూ.500, భద్రాచలం బస్టాండ్‌లో ఆరుగురు యజమానులకు రూ.6వేలు జరిమానా విధించి వసూలు చేశామని తెలిపారు. కాగా, బస్టాండ్లలోని షాపుల్లో ఎమ్మార్పీకి మించి ధర వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇందుకోసం 99592 25979 (ఖమ్మం కొత్త బస్టాండ్), 99592 25965 (ఖమ్మం పాత బస్టాండ్), 99592 25990 (సత్తుపల్లి), 89853 61796 (మణుగూరు), 99592 25982 (కొత్తగూడెం), 73829 25289 (మధిర), 99592 25987 (భద్రాచలం), 99592 25984 (ఇల్లెందు) నంబర్లకు ఫోన్ చేయాలని ఆర్ఎం కోరారు.



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో షాపు యజమానికి జరిమానా విధిస్తున్న అధికారులు

# రామయ్య సన్నిధిలో మాజీ ఉపరాష్ట్రపతి సతీమణి



పంచవటి కుటీరంలో ఉషానాయుడు, కుటుంబ సభ్యులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు సతీమణి ఉషానాయుడు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలకగా, ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. అలాగే, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని సైతం ఉషానాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వాగతం పలికిన అధికారులు, అర్చకులు స్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాల విశిష్టతను ఆమె తెలుసుకున్నారు.

# పిచ్చికుక్క స్వైర విహారం

ఐదుగురికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు: మండల కేంద్రంలోని సులేమాన్‌బజార్‌లో మంగళవారం ఓ వీధి కుక్కకు పిచ్చిలేసి స్వైరవిహారం చేసింది. ఆ వీధిలో ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులతోపాటు నడుచుకుంటూ వస్తున్న వృద్ధుడిని వెంబడించి తీవ్రంగా గాయపరిచింది. వృద్ధుడిని కాపాడేందుకు అటుగా వస్తున్న మరో వ్యక్తిపై కూడా దాడికి పాల్పడింది. స్థానికులు కర్రలతో కుక్కను వెంబడించటంతో అంబేడ్కర్ కాలనీ వైపునకు వెళ్లి పశువులను కరిచింది. పిచ్చికుక్క స్వైర విహారంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వృద్ధుడు పుట్టి సీతారాములు చేతికి, కాలికి, మూడేళ్ల కంభంపల్లి మహేశ్‌బాబుకు ముఖంపై, ఎస్సీకాలనీకి చెందిన మూడేళ్ల కేసుపాక భవ్యశ్రీకి తలకు, రెండున్నరేళ్ల ఇనుపనూరి కావ్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీధర గ్రామానికి చెందిన షేక్ కౌషర్‌పాషాకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరిని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన పశువులను స్థానిక పశువుల ఆస్పత్రికి తరలించారు.





పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి, చికిత్స పొందుతున్న వృద్ధుడు

# ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వృద్ధుడు మృతి

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన బాదావత్ రాందాస్ (68) ఆర్టీసీలో బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో మంగళవారం చోటుచేసుకుంది. రాందాస్ ఇటీవల అనారోగ్యానికి గురవడంతో తన భార్యతో కలిసి చికిత్స నిమిత్తం ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో బస్సు చిట్యాల పట్టణ శివారులోకి రాగానే రాందాస్‌కు గుండెనొప్పి వచ్చింది. బస్సులోని పలువురు అతడికి సీపీఆర్ చేసే ప్రయత్నం చేశారు. బస్సును డ్రైవర్ చిట్యాల పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపి 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అక్కడకు చేరుకుని రాందాస్‌ను పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రాందాస్ మృతదేహాన్ని పోలీసులు మరో వాహనంలో పడమటనర్సాపురం పంపించారు. కాగా, భౌతికాయాన్ని లేళ్ల వెంకటరెడ్డి, మంగీలాల్‌నాయక్, మధుసూదన్‌రావు, గోపాల్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.



బస్సులో రాందాస్ మృతదేహం

### బాత్రూంలో వ్యక్తి మృతదేహం

భద్రాచలంటౌన్: పట్టణంలోని రామాలయ కార్యాలయంలోని బాత్రూంలో ఓ వ్యక్తి మృతదేహం మంగళవారం లభించింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన జాఫర్(40) గత వారం తానీషా కల్యాణ మండపం వద్ద కొత్తగా నిర్మిస్తున్న వసతి భవనంలో టైల్స్ వేసేందుకు వచ్చాడు. సోమవారం రాత్రి సీఆర్‌ఓ కార్యాలయం పైఅంతస్తులోని తన గదిలో బాత్రూం గడియా వేసుకుని అందులో మృతి చెందాడు. మంగళవారం ఉదయం సిబ్బంది వచ్చి బాత్రూం తలుపుకొట్టి తీయకపోవడంతో బద్ధలుకొట్టి చూడగా జాఫర్ మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జాఫర్ గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ క్లీనర్ల మధ్య ఘర్షణ

గొడ్డలితో దాడి.. ఒకరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: లారీ క్లీనర్ల మధ్య జరిగిన వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారి తీసింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నందమూరి నగర్‌కు చెందిన మడకం చిన్న, ఎస్‌కే రంజాన్ లారీ క్లీనర్లుగా పని చేస్తుంటారు. సోమవారం రాత్రి డ్యూటీ ముగిసిన తర్వాత సమీపంలోని ఓ బెల్ట్ షాపునకు వెళ్లి అతిగా మద్యం సేవించి వాగ్వాదానికి దిగారు. స్థానికులు సర్ది చెప్పడంతో వారి ఇళ్లకు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం మడకం చిన్న, రంజాన్ ఇంటికి వెళ్లి దుర్భాషలాడాడు. ఈ క్రమంలో రంజాన్.. ఇంట్లో ఉన్న గొడ్డలితో చిన్నపై దాడికి పాల్పడగా తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సచేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను వివరాలు సేకరించి, బాధితుడి ఫిర్యాదు మేరకు రంజాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పశువుల సంత వేలం రూ.24.80 లక్షలు

చర్ల రూరల్: చర్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో వివిధ పనులు అప్పగించేందుకు స్థానిక మార్కెట్ ఆవరణలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. పశువుల సంతకు ప్రభుత్వ ధర రాలేదని వాయిదా వేస్తుండగా, చివరకు రూ.24.80లక్షలకు పాడిన గంధం రవికి అప్పగించారు. అలాగే, జంతువధ, మార్కెట్ ఆశీలు వసూలు వేలం పూర్తయిందని, షాపింగ్ కాంప్లెక్సు గదుల వేలం త్వరలోనే పూర్తిచేస్తామని పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు.

### పురుగు మందు దాడిలో అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి

కారేపల్లి: ఇద్దరు వ్యక్తుల ఘర్షణలో పురుగు మందు చల్లగా కళ్లు, నోటిలో పడడంతో అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మంగళితండా గ్రామానికి చెందిన మాధారం మైన్స్ విశ్రాంతి ఉద్యోగి ధరావత్ పాండ్యా(65)తో పక్కింటి వారు పాతకక్షల దృష్ట్యా ఈనెల 14న గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో సదరు వ్యక్తులు పాండ్యాపై పురుగుల మందు పోయగా ఆయన నోరు, కళ్లలో పడింది. దీంతో పెద్దలు కలగచేసుకుని ఆయనకు ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో ఈనెల 23వ తేదీన ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, పురుగుల మందు ప్రభావంతో తొలుత పాండ్యాకు ఒక కంటిచూపు పోగా, కిడ్నీలపైనా ప్రభావం పడడంతో మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య బాలి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి పోలీసులు తెలిపారు.



ధరావత్ పాండ్యా (ఫైల్)

# స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు పోటీలు



ఎంపిక పోటీలను ప్రారంభించిన అధికారులు



బ్యాటరీ టెస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లా పరిధి కిన్నెరసాని బాలుర, కాచనపల్లి బాలికల క్రీడాపాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు తుది దశ ఎంపిక పోటీలు పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడాపాఠశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాల్‌రావు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించనుండగా, 110 మంది విద్యార్థులు హాజరయ్యారని క్రీడల అధికారి తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో అధికారులు, పీడీలు కొమరం వెంకటనారాయణ, బుగ్గ వెంకటేశ్వర్లు, అన్నం వెంకటేశ్వర్లు, రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, నర్సయ్య, రామారావు, మోతీలాల్, కృష్ణ, డి.శిరోమణి, హతీరామ్, రవి, ముత్తయ్య, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలకు తెర

తల్లాడ: తల్లాడ మండలం నారాయణపురంలోని లూర్దుమాతా పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రం కొనసాగుతుండగా, ఇక్కడ సీసీ కెమెరాలకు తెరవేశారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు లూర్దుమాతా ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, లూర్దుమాతా యాజమాన్యం తరగతి గదుల్లో గతంలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇన్నాళ్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే పరీక్షలు జరగగా.. గత శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ సందర్భంగా ఆరా తీసి ముసుగు కప్పాలని ఆదేశించారు. దీంతో మంగళవారం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారి గదుల్లో తప్ప మిగతా కెమెరాలన్నింటికీ కవర్లు కప్పించారు. అయితే, మాస్ కాపీయింగ్ జరుగుతున్నందునే విషయం బయటకు రాకుండా ఇలా చేశారని ఆరోపిస్తున్న కొందరు.. నిబంధనలే కారణమైతే ఇన్నాళ్లు ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సీ.హెచ్.సుదర్శన్‌ను వివరణ కోరగా పాఠశాల యాజమాన్యం పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉన్నందున గదుల్లో సమాచారం బయటకు వెళ్లకుండా సీసీ కెమెరాలకు ప్లాస్టిక్ కవర్లు తొడిగినట్లు తెలిపారు. అంతేతప్ప ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు.

### యువతి అదృశ్యంపై కేసు

అశ్వారావుపేటరూరల్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడేనికి చెందిన ఓ యువతి సోమవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తల్లి దుర్గమ్మ నిద్రలేచి చూసే సరికే కనిపించలేదు. దుర్గమ్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

### బాలిక అదృశ్యంపై..

అశ్వారావుపేటరూరల్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఇంట్లో ఉంచి తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లారు. సాయంత్రానికి ఇంటికి వచ్చేసరికి బాలిక కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికారు. ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

### బెల్ట్ దుకాణంలో తనిఖీ

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో బెల్ట్ దుకాణంపై మంగళవారం స్థానిక పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. సుమారు రూ.21 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జీవన్‌రాజు తెలిపారు.

### ట్రాక్టర్ ట్రక్కు చోరీ

వైరారూరల్: మండలంలోని విప్పలమడకలో ట్రాక్టర్ ట్రక్కు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన రైతు దేవభక్తిని అర్జునరావు తన ట్రాక్టర్ ట్రక్కును ఈనెల 22న గ్రామంలోని తన బంధువుల ఖాళీ స్థలంలో నిలిపాడు. మంగళవారం పరిశీలించగా ట్రక్కు లేకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి ఎక్కడ వెతికినా ఫలితం కానరాలేదు. దీంతో రూ.1.20లక్షల విలువైన ట్రక్కు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### రెండు మట్టి టిప్పర్లు సీజ్

నేలకొండపల్లి: మండలం కేంద్రంలో మంగళవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రెండు మట్టి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా వెంచర్లకు మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో టిప్పర్లను వెంబడించి అడ్డుకున్నారు. అనంతరం టిప్పర్లను స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**రెండు ఇసుక ట్రాక్టర్లు...**

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి శివారు పాలేరు ఏటి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్.ఐ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యాన మంగళవారం సీజ్ చేశారు. ఈ మేరకు యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



నాగమణి మృతదేహం

అశ్వారావుపేటరూరల్: వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కాగా మృతురాలి కుటుంబీకులు, బంధువులు భారీగా తరలిరాగా పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కాపవరానికి చెందిన కంపసాటి నాగమణి (25)కి అశ్వారావుపేట మండలం గుర్రాలచెరువు గ్రామానికి చెందిన కంపసాటి వెంకన్న బాబుతో పదేళ్ల కిందట వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నంగా రూ.2 లక్షలు నగదు, 5 కాసుల బంగారం, పెళ్లి ఖర్చులకు అదనంగా రూ.లక్ష ఇచ్చారు. దంపతులకు ఇద్దరు సంతానం. కొంతకాలంగా దంపతుల మధ్య కలహాలు చోటుచేసుకుంటున్నాయి. భర్తతోపాటు అత్త భూలక్ష్మి, మామయ్య నాగయ్య కలిసి అదనపు కట్నం కోసం నాగమణిని వేధిస్తున్నారు. సోమవారం రాత్రి కుడా దంపతుల మధ్య గొడవ జరగగా భార్యను వెంకన్న బాబు దుర్భాషలాడి చితకబాదినట్లు బంధువులు చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోనే నాగమణి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుటుంబీకులు వాపోయారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రమణ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




పోలీస్ స్టేషన్ వద్ద మృతురాలి బంధువులు

**పోలీస్ స్టేషన్ వద్ద, పంచనామా సమయంలో ఉద్రిక్తత**

వివాహిత ఆత్మహత్య ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద, శవ పంచనామ సమయంలో ఉద్రిక్తత నెలకొంది. మృతురాలి కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో రెండు వాహనాల్లో అశ్వారావుపేటకు వచ్చారు. ముందుగా గుర్రాల చెరువు గ్రామంలో కుల పెద్దల సమక్షంలో రాజీకి యత్నించగా, మృతురాలి కుటుంబీకులు ఒప్పుకోలేదు. దాంతో రెండు వర్గాలుగా వీడిపోయి, స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. పెద్ద సంఖ్యలో ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్ వద్ద, శవ పంచనామా చేసే ఆస్పత్రి వద్ద మోహరించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలోనే మృతురాలి శవ పంచనామా జరిపించారు. కాగా, నాగమణి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆమె తరఫు వారు ఆరోపిస్తున్నారు. స్థానిక సీఐ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆత్మహత్య ఘటనపై అనుమానాలు ఏమీ లేవని, శవ పంచనామా రిపోర్ట్ వస్తే పూర్తి విషయాలు తెలుస్తాయన్నారు.